# పక్కదారి పట్టకుండా పీడీఎస్ బియ్యంపై కఠిన నిఘా

**ఈ-కేవైసీ జూలై 31లోగా పూర్తి చేసుకోవాలి: కలెక్టర్ హరిత**



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి జూలై 23:** ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా రేషన్ కార్డుదారులు, అంగన్‌వాడీలు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలకు సరఫరా చేస్తున్న సన్నబియ్యం పక్కదారి పట్టకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఆహార భద్రత విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 315 చౌకధరల దుకాణాలు, 973 అంగన్‌వాడీ కేంద్రాలు, 1,173 పాఠశాలలు, 115 సంక్షేమ వసతి గృహాలకు ప్రతి నెల సుమారు 3,205 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రేషన్ కార్డుదారులు జిల్లాలోని ఏ చౌకధరల దుకాణం నుంచైనా పోర్టబిలిటీ ద్వారా బియ్యం పొందే అవకాశం ఉందని, డీలర్లు సక్రమంగా పంపిణీ చేస్తున్నారో లేదో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలో 40 మంది రేషన్ డీలర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని త్వరగా భర్తీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొత్త చౌకధరల దుకాణాల కోసం గ్రామాల వారీగా వచ్చిన ప్రతిపాదనల జాబితాను సిద్ధం చేయాలని చెప్పారు. రేషన్ కార్డుదారులు ఈ-కేవైసీ ప్రక్రియను ఈ నెల 31లోగా తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారునికి రేషన్ బియ్యం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రవాణా సౌకర్యం లేని గ్రామాలకు మూడు నెలల బియ్యం కోటాను ముందుగానే సరఫరా చేయడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డులను త్వరగా మంజూరు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జడ్పీ సీఈఓ లక్ష్మీనారాయణ, డీటీడీఓ అంబాజీ, డీఈఓ సచ్చిదానంద చారి, జిల్లా పౌరసరఫరాల అధికారి సాధిక్, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

**ఎంపిడిఓ అంజత్ పాషా**

**కెరమెరిలో ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం**



**జననినాదం,సిర్పూర్(యు),కెరమెరి జూలై 23:** ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) పనులను వేగవంతంగా పూర్తి చేసి, నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఎంపిడిఓ అంజత్ పాషా అధికారులకు సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గుంతల తవ్వకం (పిట్టింగ్), మొక్కల నాటకం పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో సూచించారు. అలాగే గ్రామాల్లో మ్యాజిక్ సోక్ పిట్స్, సామూహిక సోక్ పిట్స్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షపు నీటి సంరక్షణ (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్) పనులు, పెర్కొలేషన్ ట్యాంకుల (భూగర్భ జలాల పునర్భరణ చెరువులు) నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకుని భూగర్భ జలాల మట్టాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, టెక్నికల్ అసిస్టెంట్ అఖ్యా నాయక్, టీఏ రవీందర్, దరం సింగ్, పంచాయతీ కార్యదర్శులు సతీష్ రావు, ప్రశాంత్, ఈశ్వర్, రాజు, శ్వేత అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలి


**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**





**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 23:** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విధుల పట్ల సమయపాలన పాటించాలని, వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించే విధంగా కృషి చేయాలని తెలిపారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ పుష్పలత తో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణను పరిశీలించారు. ప్రజల నుండి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియలో జాగ్రత్త వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టంగా వివరాలు నమోదు చేయాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రక్రియ వేగవంతానికి బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్లు, యువత సహకారం తీసుకోవాలని తెలిపారు. భూభారతి, సాదా బైనమా, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి మండలంలోని గ్రామపంచాయతీల పనితీరు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ నిరంతరం చేపట్టాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యక్తిగత గృహ మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసే వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, త్రాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ప్రతిరోజు పనుల పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. ఉద్యోగులు, సిబ్బంది విదుల పట్ల సమయపాలన పాటించాలని, గ్రామాలలో అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా ప్రతి పనిని బాధ్యతాయుతంగా నిర్వహించాలని తెలిపారు. గ్రామపంచాయతీలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అనంతరం లక్షెట్టిపేట మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అత్యవసర విభాగం, సామాజిక వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు, పారిశుధ్య నిర్వహణ, ఓ.పి. రిజిస్టర్ అంశాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం అయినందున అంటువ్యాధుల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, ఆసుపత్రి పరిసరాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ తో కలిసి మున్సిపల్ పరిధిలో అమృత్ 2.0 పథకంలో భాగంగా చేపట్టిన పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వంటశాలను పరిశీలించి వంట సిబ్బంది ఆహారం తయారీ సమయంలో శుభ్రత నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, ధాన్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని ఆదేశించారు.

# తాండూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన మంచిర్యాల డీసీపీ



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 23:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్‌లో ఉన్న తాండూర్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ దేవయ్య, ఎస్ఐ ప్రసాద్ పుష్పగుచ్ఛం అందించి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం డీసీపీ పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, రిసెప్షన్ సెంటర్‌లోని సిబ్బందితో మాట్లాడి రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, అప్‌లోడ్ ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల ఫైళ్లు, క్రైమ్ రికార్డులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ వ్యవహారాలపై సీఐ దేవయ్య, ఎస్ఐ ప్రసాద్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరాల ఫుటేజీని నిరంతరం పర్యవేక్షిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకోవడంతో పాటు సమాచార వ్యవస్థను పటిష్ఠం చేసుకోవాలని సూచించారు. ప్రజల్లో చట్టాలపై,సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై, సైబర్ నేరాల పట్ల అప్రమత్తతపై అవగాహన కల్పించాలని, మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలని తెలిపారు. అలాగే రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్, సీటు బెల్టు ధరించడం యొక్క ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల భద్రత దృష్ట్యా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, వాటి ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, గ్రామపంచాయతీలు, జాతీయ రహదారి ప్రాంతాల్లో ప్రమాదాల నివారణ కోసం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థతో పాటు ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ కోసం రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ తనిఖీలలో ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ దేవయ్య, ఎస్ఐ ప్రసాద్‌తో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిఎంఆర్ బకాయిలను తక్షణమే పూర్తి చేయాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**




**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 23:** జిల్లాలో సిఎంఆర్ బకాయిలను తక్షణమే పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని జన్నారం మండలం పొనకల్ గ్రామంలో గల శ్రీ శివసాయి రాఘవేంద్ర రైస్ మిల్లు, మగ్గిగూడ గ్రామంలోని రాజరాజేశ్వరి రైస్ మిల్లులను, దండేపల్లి మండలం లింగాపూర్‌లోని శ్రీ కృష్ణ అగ్రో ఇండస్ట్రీస్, పెద్ద పేటలోని భవాని ఇండస్ట్రీస్, కన్నెపల్లిలోని వెంకటేశ్వర పీబీఆర్‌ఎం, రాధాకృష్ణ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆయా మండలాల తహసీల్దార్లతో కలిసి పరిశీలించి అధికారులతో వరి ధాన్యం కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) పెండింగ్ అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2025--26 వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించిన పెండింగ్ సిఎంఆర్ బియ్యం సంబంధిత పురోగతిని సమీక్షించారు. రైస్ మిల్లులలో పెండింగ్‌లో ఉన్న సిఎంఆర్‌ను వెంటనే పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలని, నిర్దేశిత గడువులోగా సిఎంఆర్‌ను పూర్తి చేయని పక్షంలో ఆ ధాన్యాన్ని మెరుగైన పనితీరు కనబరిచే ఇతర రైస్ మిల్లులకు తరలించే చర్యలు తీసుకుంటామని రైస్ మిల్లుల యాజమాన్యాలకు సూచించారు. అనంతరం జన్నారం, దండేపల్లి తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. సాదాబైనామా, భూ భారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకొని, రికార్డులను అనుసరించి 60 రోజులకు పైగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జన్నారం, దండేపల్లి మండలాల తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఓటరు ఫారాల డిజిటలైజేషన్‌ను 100% పూర్తి చేయాలి

**రాజకీయ పార్టీల సహకారం అవసరం కలెక్టర్ హరిత**





**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి జూలై 23:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను నిర్ణీత గడువులోగా వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు.

గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 85.94 శాతం ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని, మిగిలిన 14 శాతం కూడా త్వరగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు, మున్సిపల్ పాలకవర్గాలు సహకరించాలని కోరారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీల పరిధిలో ఇంకా పలువురు ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించలేదని, ఫారాలు అందించని వారు ఓటు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఫారాలు సమర్పించని ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీలకు అందజేస్తామని, వారిని గుర్తించి బూత్ స్థాయి అధికారులకు ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, ఏఎస్‌డీ ఓటర్ల జాబితా తయారీ, మరణించినవారు, గ్రామం విడిచి వెళ్లిన వారి వివరాల సేకరణ కూడా కొనసాగుతోందని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో బూత్ స్థాయి ఏజెంట్లు చురుకుగా పనిచేసేలా రాజకీయ పార్టీలు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, డీఆర్వో దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, శిక్షణ ఉప కలెక్టర్ జాస్టిన్ జోన్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్లు మెంగ్రే ఆకాష్, పహీమ్ సుల్తానా, వైస్ చైర్మన్ ఎండి. అహ్మద్, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో

# మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆత్రం శంకరరావు**



**జననినాదం,సిర్పూర్(యు) 23:** బీజేపీ ప్రభుత్వ హయాంలో నీట్‌తో పాటు పలు జాతీయ స్థాయి పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు వరుసగా లీక్ కావడం వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆత్రం శంకరరావు అన్నారు. గురువారం సిర్పూర్(యూ) మండల కేంద్రంలో రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ
ప్రజాస్వామ్యబద్ధంగా విద్యార్థులకు మద్దతుగా శాంతియుత నిరసన చేపట్టిన లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చన్నారు. పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైన కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ సభ్యుడు సుదల శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాశ్, మాజీ ఎంపీపీ ఆత్రం దౌలత్‌రావు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీ ఏ. వీణాబాయి, మాజీ ఎంపీటీసీ టీ. లక్ష్మీబాయి, మాజీ ఎంపీటీసీ గోవింద్‌రావు, సర్పంచ్‌లు లక్ష్మీ భీర్షా, స్పందన భూపత్, జానారావు, సీనియర్ నాయకులు సోయం మొతిరం, సేద్మకి నాగోరావు, జాగ్‌రావు, వెద్మ దత్తు, ఏ. దుర్పత్, డైరెక్టర్ జలింష్, కోట్నాక నాగోరావు, ఉసేన్, ఎం. జంగు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ చూపితే రాష్ట్రస్థాయికి అవకాశం

**27న జిల్లా అథ్లెటిక్స్ పోటీలు**

**కోట్నాక విజయ్, గుండం లక్ష్మణ్**



**జననినాదం,ఆసిఫాబాద్ 23:** జిల్లాలోని యువ క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకుని రాష్ట్రస్థాయికి చేరుకునేందుకు ఈ నెల 27న నిర్వహించే జిల్లా స్థాయి యూత్, కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లు వేదిక కానున్నాయని కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట్నాక విజయ్, ప్రధాన కార్యదర్శి గుండం లక్ష్మణ్ తెలిపారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ 5వ జాతీయ జావెలిన్ డే వేడుకల సందర్భంగా ఆసిఫాబాద్ ట్రైబల్ మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కిడ్స్, యూత్, జావెలిన్ త్రో విభాగాల్లో వివిధ వయోపరిమితుల ప్రకారం పోటీలు ఉంటాయని తెలిపారు. జిల్లా స్థాయిలో విజేతలైన క్రీడాకారులకు ఆగస్టు 7, 8 తేదీల్లో హనుమకొండ జేఎన్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని చెప్పారు. పోటీలకు ఈ నెల 26 వరకు ఎంట్రీలు స్వీకరిస్తామని, పాల్గొనే వారు ఎంఆర్వో ధ్రువీకరించిన జనన ధ్రువీకరణ పత్రం లేదా ఎస్ఎస్‌సీ మెమో ఒరిజినల్‌తో పాటు జిరాక్స్ ప్రతిని తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, స్పోర్ట్స్ అకాడమీలు, హాస్టళ్లకు చెందిన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు అథ్లెటిక్స్ కోచ్ విద్యాసాగర్ (8008090626)ను సంప్రదించాలని తెలిపారు.

# ఎస్ఐఆర్ లో భాగంగా డిజిటలైజేషన్

# ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 23:** జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములు లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ దాదాపు 90 శాతం వరకు పూర్తయిందని, మిగిలిన మొత్తాన్ని నిర్ణీత గడువు కంటే ముందుగానే పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో అనామోలీస్ ఎక్కువగా ఉన్నాయని, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. నోటీసుల విషయంలో ఓటర్లు కంగారు పడవలసిన అవసరం లేదని, నోటీసులో పేర్కొన్న ధ్రువపత్రాలను సమర్పించడం ద్వారా ఓటు హక్కును పొందవచ్చని తెలిపారు. డబుల్, డెత్, షిఫ్ట్ అయినవారి ఓట్లను నిబంధనల ప్రకారం తొలగించడం జరుగుతుందని, ఇంకా ఎన్యూమరేషన్ ఫారాలు అందించని వారిని గుర్తించి బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా బూత్ స్థాయి అధికారులకు సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డిజిటలైజేషన్ పూర్తయిన తర్వాత పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండలాధికారి శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

**– ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం**

**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 23:** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి. రాజలక్ష్మి సూచించారు. గురువారం జైపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన "డ్రగ్ అబ్యూస్ -- మాదకద్రవ్యాల దుర్వినియోగం" అంశంపై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్యాధికారి డాక్టర్ గోపాల్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్‌కు బానిసైతే శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు సమాధానాలు ఇచ్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు కె. చంద్రశేఖర్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు, ఏఎన్ఎంలు (ఆచీవీం), స్టూడెంట్ కౌన్సిలర్ హరి ప్రసాద్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# విధుల్లో అలసత్వం.. సహించం

**మోవాడ్‌లో పీహెచ్‌సీ, ఆశ్రమ పాఠశాలపై కలెక్టర్ హరిత ఆకస్మిక తనిఖీ**

**రికార్డులు సక్రమంగా లేకపోవడంపై ఆగ్రహం.. సిబ్బందికి గైర్హాజరు నమోదు**



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి జూలై 23:** విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కె. హరిత హెచ్చరించారు. గురువారం ఆసిఫాబాద్ మండలం మోవాడ్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, ఆశ్రమ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, రికార్డుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం కనిపించడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపీ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్లు ఖాళీగా ఉండటంతో పాటు మందుల వివరాలు నమోదు చేయకపోవడాన్ని తప్పుబట్టారు. గత పది రోజులుగా సిబ్బంది హాజరు నమోదు చేయకపోవడంతో సంబంధిత సిబ్బందికి గైర్హాజరు నమోదు చేస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆశ్రమ పాఠశాలను సందర్శించిన కలెక్టర్, 58 మంది విద్యార్థులకు 10 మంది ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ విద్యార్థుల హాజరు తక్కువగా ఉండటాన్ని గమనించారు. హాజరు శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడిన ఆమె, విద్యాబోధన, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, తాగునీటి సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు ఆర్ఓ తాగునీరు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై గ్రామ పటేల్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి కుటుంబం తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబ సభ్యుల వివరాలను కూడా ఫారమ్‌లలో నమోదు చేసి సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని గ్రామస్తులకు సూచించారు.

## వాహనాల పాత సామగ్రి బహిరంగ వేలం లో -- ఆసక్తి గల వారు పాల్గొనాలి

**-రామగుండం సీ.పి అంబర్ కిషోర్ ఝా**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 23:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ వాహనాలకు సంబంధించిన పాత సామగ్రిని బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈ నెల 27న కమిషనరేట్ ప్రధాన కార్యాలయ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ వేలంలో వాహనాలకు సంబంధించిన పాత విడిభాగాలు, టైర్లు, బ్యాటరీలు, వినియోగించిన ఇంజిన్ ఆయిల్ తదితర సామగ్రిని విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన ఆసక్తి గల వ్యక్తులు, వ్యాపారులు, సంస్థల ప్రతినిధులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని వేలంలో పాల్గొనాలని కమిషనర్ సూచించారు. వేలం ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించబడుతుందని, ఆసక్తి గల వారు ముందుగానే వివరాలు తెలుసుకొని నిర్ణీత సమయంలో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం రవాణా విభాగం అధికారి మల్లేశంను ఈ ఫోన్ నెంబర్ లో 8712656616 సంప్రదించవచ్చని సూచించారు. ఈ బహిరంగ వేలం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతో పాటు వినియోగానికి పనికివచ్చే పాత సామగ్రి ప్రజలకు అందుబాటులోకి రానుంది.

## ఏఐటీయూసీ మంచిర్యాల జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**ఆగస్టు 2న మహాసభలు నిర్వహణకు పిలుపు**




**జననినాదం,మంచిర్యాల ప్రతినిధిజూలై 23:** మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలోని భగత్ సింగ్ భవన్‌లో ఏఐటీయూసీ తాండూర్ మండల మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ సభకు కొండు బానేష్ అధ్యక్షత వహించగా, జిల్లా కార్యదర్శి మేకల దాసు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మేకల దాసు మాట్లాడుతూ దేశంలో ఏర్పడిన మొట్టమొదటి కార్మిక సంఘమైన ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31న బొంబాయి నగరంలో ఆవిర్భవించిందని గుర్తుచేశారు. బ్రిటిష్ పాలన కాలం నుంచే కార్మికులను ఐక్యపరిచి వారి హక్కుల కోసం రాజీ లేని పోరాటాలు సాగిస్తోందన్నారు. కనీస వేతన చట్టం, సంఘం ఏర్పాటు హక్కు, సమ్మె హక్కు వంటి అనేక హక్కులు ఏఐటీయూసీ పోరాటాల ఫలితమని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను దెబ్బతీస్తోందని విమర్శించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పేరుతో కార్మికులను దోపిడీ చేస్తూ తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ వంటి ప్రాథమిక హక్కులు అమలు కావడం లేదని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టాలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని అన్నారు. అంగన్వాడి, ఏఎన్ఎం, ఆశా, ఆర్టీసీ, మధ్యాహ్న భోజనం, 108-104 సిబ్బంది, హాస్పిటల్ కార్మికులు, హమాలీలు, ఆటో డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు, లారీ డ్రైవర్లు, పెయింటింగ్, సెంట్రింగ్, మార్బుల్ తదితర రంగాల్లో పనిచేసే కార్మికులు ఉపాధి సమస్యలు, తక్కువ వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతన చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే ఆగస్టు 2న జరిగే ఏఐటీయూసీ మంచిర్యాల జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ తాండూర్ మండల కన్వీనర్‌గా తాని శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో భయ్యా మొగిలి (గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షులు), సాలీగామ సంతోష్, వాసాల నాగరాజు, పట్టి శంకర్, దాసరి లక్ష్మి, కొండు సాయికుమార్, కుర్సింగ తిరుపతి, మీసాల సన్యాసి, గాజుల దేవయ్య, ముత్తె శంకర్, పెద్ద బోయిన చందు, ఉట్నూరి అంకేష్, పెద్ద బోయిన లక్ష్మణ్, పెద్ద బోయిన మహేందర్, మంచర్ల వెంకటేష్, ధర్మరాజుల అభిరామ్, పెద్ద బోయిన మనోహర్, ఎలిగేటి భీమేష్, కమ్మరి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

**రాపిడోపై ఐక్యంగా పోరాటం చేస్తాం**

**హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్**



జననినాదం,మంచిర్యాల 23:ఆటో డ్రైవర్ల జీవనోపాధిని కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేకుంటే అన్ని ఆటో యూనియన్లతో కలిసి ఉమ్మడి ఉద్యమం చేపడతామని హెచ్ఎంఎస్ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం మంచిర్యాల పట్టణంలోని వివేకవర్ధిని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో హెచ్ఎంఎస్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం అమలు అనంతరం ఆటోలకు గిరాకీ గణనీయంగా తగ్గి వేలాది మంది డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాపిడో కార్యకలాపాల కారణంగా ఆటో కార్మికుల జీవనోపాధి మరింత దెబ్బతింటోందని పేర్కొన్నారు. రాపిడోను అరికట్టేందుకు అన్ని ఆటో యూనియన్లు ఐక్యంగా పోరాటం చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు తెలిపారు. అవసరమైతే జిల్లా వ్యాప్తంగా బంద్ నిర్వహించి రాపిడో కార్యకలాపాలను అడ్డుకుంటామని తెలిపారు.
ప్రభుత్వం రూ.1,000 కోట్ల నిధులతో ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఆటో సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు రోజుకు రూ.500 చొప్పున జీవన భృతి, 50 సంవత్సరాలు దాటిన వారికి నెలకు రూ.6 వేల పెన్షన్ అందించాలని కోరారు. మహాలక్ష్మి పథకం వల్ల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యం కల్పించాలని, ఆటోల ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ తదితర ప్రభుత్వ రుసుములను ప్రభుత్వమే భరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి షఫీ, ప్రధాన కార్యదర్శి తగరం శ్రీనివాస్, జేఏసీ జిల్లా అధ్యక్షుడు కట్ట రామ్‌కుమార్, బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు చల్ల విక్రం, 246 ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పొట్ట మధు, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అభి పాషా, ఆర్‌డబ్ల్యూఏ నాయకుడు సుద్దాల రాజు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460